

వరంగల్‌లో అంబరాన్నంటిన అంబేద్కర్ జయంతి వేడుకలు 6

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -338 బుధవారం 15 ఏప్రిల్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# తెలంగాణలో దళితుల అభ్యున్నతికి పెద్దపీట

## అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ఎస్సీ, ఎస్టీలకు పదేండ్లలో దక్కని అవకాశాలు కల్పించాం**

**దళితున్ని అధ్యక్షా అనాల్సి వస్తుందని కొందరు అసెంబ్లీకే రావడంలేదు**


**బీజేపీ ప్రతిపాదిత డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం**



**హైదరాబాద్ ఏప్రిల్ 14(జర్నలిస్ట్ వార్త);**
"రక్తం చిందించకుండా శాంతితో యుద్ధాన్ని గెలవొచ్చని మహాత్మాగాంధీ నిరూపిస్తేడ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా పరిపాలించడమేలానో నిరూపించింది బీఆర్.అంబేద్కర్‌డఒకరు దేశానికి స్వాతంత్ర్యం తీసుకొస్తేడ మరొకరు రాజ్యాంగాన్ని రూపొందించి అణగారిన వర్గాలకు దిక్సూచిగా నిలిచారు. గాంధీ పాత్ర ఎంత ఉందో.. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో అంబేద్కర్ పాత్ర అంతే ఉంది. ఇద్దరు ఈ దేశానికి రెండు కండ్లు. నేడు ప్రపంచం అంబేద్కర్ ఆలోచనలను అనుసరిస్తోంది. ఆయన ఆశయాలేడ మా ప్రభుత్వ లక్ష్యాలు" అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన వేడుకల్లో పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ**మిగతా 2లో...**

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వండి

## : ఏపీలోని అన్ని పార్టీలకు సీఎం చంద్రబాబు లేఖ



**అమరావతి,ఏప్రిల్ 14(జర్నలిస్ట్ వార్త);**
చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన 'నారీ శక్తి వందన్ అధినియం'పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ముందడుగు వేశారు. ఈ చారిత్రక బిల్లుకు సంపూర్ణ మద్దతు కూడగట్టే లక్ష్యంతో ఆయన రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులకు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు మంగళవారం లేఖ రాశారు. రాబోయే 2029 ఎన్నికల నుంచే ఈ రిజర్వేషన్లు అమల్లోకి తీసుకురావాలన్న**మిగతా 2లో...**

# మోదీకి ట్రంప్ ఫోన్...

## 40 నిమిషాల పాటు సంభాషణ

**ఈ సంవత్సరం వీరిద్దరు ఫోన్‌లో మాట్లాడుకోవడం ఇది మూడోసారి**

**ద్వైపాక్షిక సహకారం సాధించిన పురోగతిపై చర్చించినట్లు వెల్లడి**

**పశ్చిమాసియా ఉద్రిక్తతలు, హర్మూజ్ జలసంధిపై చర్చించామన్న మోదీ**



**న్యూఢిల్లీ ఏప్రిల్ 14(జర్నలిస్ట్ వార్త);**
ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాదాపు 40 నిమిషాల పాటు ఫోన్‌లో సంభాషించుకున్నారు. ఈ సంవత్సరం వీరిద్దరు ఫోన్‌లో మాట్లాడుకోవడం ఇది మూడోసారి. పశ్చిమాసియాలో ఫిబ్రవరి 28న ఉద్రిక్తతలు ప్రారంభమైనప్పటి నుంచి వారిద్దరు **మిగతా 2లో...**

# బీహార్ కొత్త సిఎం సమ్రాట్ చౌధరీ

**బీహార్ సిఎం పదవికి నితీశ్ రాజీనామా**

**కొత్త సిఎంగా బిజెపికి చెందిన సమ్రాట్ చౌధరీ ఎంపిక**

**నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న సమ్రాట్**



# సమ్మె యోచన విరమించండి

**మా తలుపులు తెరిచే ఉన్నాయి**

**ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి**





# నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

**అమరావతి ఏప్రిల్ 14(జర్నలిస్ట్ వార్త);**
ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ 2026 ఫలితాలను బుధవారం నాడు విడుదల చేయనున్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఉదయం 10:31 గంటలకు విడుదల చేయనున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థుల ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ **https://resultsbie.ap.gov.in/** ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే, విద్యార్థులు క్యూలో నిలబడాల్సిన అవసరం లేకుండా 'మన మిత్ర' వాట్సాప్ ద్వారా కూడా ఫలితాలను సెకన్లలో పొందవచ్చని చెప్పారు.**మిగతా 2లో...**



# రేవంత్ రెడ్డి 'బంట్రోతు' వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్

# దళితులపై కాంగ్రెస్ వివక్ష

**ప్రభుత్వ వైఫల్యాలను ప్రతిఘటిస్తాం**

**అంబేద్కర్ అందరివాడు -మహాత్మాగాంధీతో సమానం**

**: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**తెలంగాణ భవన్‌లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు**



# రెండు బిల్లులు గట్టెక్కేనా...?

**రేపు పార్లమెంటు ముందుకు మహిళా, డీ లిమిటేషన్ బిల్లులు**

**మూడింట రెండొంతుల ఓట్లకు దూరంగా ఎన్‌డిఎ**

**నేడు ఇండియా వేదిక సమావేశం**

**న్యూఢిల్లీ ఏప్రిల్ 14(జర్నలిస్ట్ వార్త);**
మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి రంగం సిద్ధమైంది. రేపు (గురువారం) జరగనున్న ప్రత్యేక పార్లమెంటు సమావేశంలో ఈ బిల్లులను కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంగళవారం ఎంపీలకు సమాచారం ఇవ్వడంతోపాటు, బిల్లు ప్రతులను వారికి పంపింది. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లులోని అంశాల ప్రకారం ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాలు 850కి చేరనున్నాయి. రాష్ట్రాల్లో 815కు లోక్‌సభ స్థానాలు చేరుతాయని, కేంద్ర పాలిత ప్రాంతాల్లో **మిగతా 2లో...**



# మోదీకి ట్రంప్ ఫోన్...

**మొదటిపేజీ తరువాయి**

మాట్లాడుకోవడం ఇది రెండోసారి. తాజాగా, తనకు ట్రంప్ నుంచి ఫోన్ కాల్ వచ్చిందని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు.

మిత్రుడు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి తనకు ఫోన్ కాల్ వచ్చిందని పేర్కొన్నారు. వివిధ రంగాలలో అమెరికా, భారత్ ద్వైపాక్షిక సహకారం సాధించిన గణనీయమైన పురోగతిని సమీక్షించినట్లు తెలిపారు. అన్ని రంగాల్లో ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. పశ్చిమాసియాలోని పరిస్థితులపై కూడా తమ మధ్య చర్చ జరిగిందని వెల్లడించారు. హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడం, స్వేచ్ఛగా, సురక్షితంగా నిర్వహించడం ఎంత అవసరమో నొక్కి చెప్పామని మోదీ పేర్కొన్నారు.

కాగా, అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలం కావడం, పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమైన నేపథ్యంలో వీరిద్దరు మాట్లాడుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

**మొదటిపేజీ తరువాయి**

ఇందుకోసం 95523 00009 నెంబర్‌కు 'హాయ్' అని మెసేజ్ పంపాలని సూచించారు. అనంతరం వారి హాల్‌టికెట్ వివరాలను నమోదు చేసి ఫలితాలు పొందవచ్చని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, 'ఇది మీ సమయం.. మెరుగైన ఫలితాలతో మెరవండి' అని ఆకాంక్షించారు.

# రెండు బిల్లులు గట్టెక్కేనా...?

**మొదటిపేజీ తరువాయి**

35 వరకు పెరిగే అవకాశం ఉందని సమాచారం. నియోజకవర్గాల పునర్విభజన కోసం 2011 జనాభా లెక్కలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంది. మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ప్రతిపక్షాల డిమాండ్లను, చేసిన సూచనలను కేంద్రప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో బిల్లుల ఆమోద ప్రక్రియలో భాగంగా తప్పనిసరిగా చేయాల్సివున్న రాజ్యాంగ సవరణ అంశం ఆసక్తికరంగా మారింది. దీనికోసం రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు 2026ను కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తోంది. అయితే, ఇది ఆమోదం పొందడానికి అవసరమైన మెజార్టీ మార్కుకు ఎన్‌డిఏ దూరంగా ఉండటమే దీనికి కారణం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగ సవరణకు సభలో హాజరై ఓటువేసే సభ్యులలో రెండింట మూడో వంతు మంది మద్దతు తెలపడం తప్పనిసరి. దీని ప్రకారం ప్రస్తుత లోక్‌సభలో 540 మంది సభ్యులుండగా, వీరందరూ హాజరై ఓటు వేస్తే కనీసం 360 ఓట్లు అనుకూలంగా రావాల్సి ఉంది. అయితే, ప్రస్తుతం ఎన్‌డిఏ కూటమికి 293 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. దీంతో అవసరమైన మెజార్టీ మార్కుకు ఎన్‌డిఏ ఎలా చేరుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. దీంతో బుధవారం జరగనున్న ఇండియా వేదిక సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే నివాసంలో ఈ భేటీ జరగనుంది. బిల్లులో ప్రతిపాదించిన అంశాలపై చర్చించనున్నారు.

### డీలిమిటేషనే అసలు సమస్య

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్ విభజన బిల్లుపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్, డిఎంకె, తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలతో కలిపి మొత్తం 152 మంది ఎంపీలు తీవ్ర అభ్యంతరాలను తెలియజేసినట్లు సమాచారం. ఎన్‌డిఏలో కూడా కొంత అసంతృప్తి కనిపిస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల నేతలకు లేఖలు రాశారు. అదే సమయంలో ఆయన పునర్ విభజన బిల్లు అంశాన్ని నామమాత్రంగా కూడా ప్రస్తావించలేదు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల దక్షిణాదికి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉండటంతో ఈ విషయంలో ఆచితూచి వ్యవహరించాలని భావి స్తున్నట్లు సమాచారం. దక్షిణాది రాష్ట్రాలకు భారీ నష్టం జరుగుతుందన్న నేపథ్యంలో 16 మంది ఎంపిలున్న టిడిపితో పాటు వైసిపి కూడా ఎలా వ్యవహరిస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటి వరకు ఈ రెండు పార్టీలు రాష్ట్రంలో దుమ్మెత్తి పోసుకున్నా కేంద్రంలో మోడీ సర్కారుకు అనుకూలంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు తమిళనాడులోని డిఎంకె పార్టీ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని, ద్రవిడ ఉద్యమం నాటి రోజులను గుర్తుకు తీసుకొస్తామని ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి స్టాలిన్ హెచ్చరించారు. తృణమూల్ కాంగ్రెస్ నేత డెరిక్ ఓబెరిన్ పునర్విభజన బిల్లుకు ఆమోదం పొందడం కోసమే మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రం తీసుకొస్తోందని వ్యాఖ్యానించారు. అదే సమయంలో ఈ ప్రక్రియలో పెద్ద ఎత్తున లబ్ధిపొందే అవకాశం ఉన్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాద్ పార్టీ ఎటువంటి వైఖరి తీసుకుంటుందన్నది కూడా ఆసక్తికరంగా మారింది. ఆ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ 'జనగణన చేయకుండా పునర్విభజన ఎలా చేస్తారు?' అని ప్రశ్నించారు. అదే సమయంలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆయన మద్దతు ప్రకటించారు.

# దళితులపై కాంగ్రెస్ వివక్ష

**హైదరాబాద్‌ఏప్రిల్ 14(జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. దళితులకు ఇచ్చిన హామీలు, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, అంబేద్కర్ అభయహస్తం అమలు చేయలేదని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను అడుగడుగునా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి కేటీఆర్ సహా ఇతర నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాజ్యాంగంలో ఆర్టికల్ 3 లేకపోతే తెలంగాణ రాష్ట్రం లేదన్నారు. గురుకులాలను రాష్ట్ర ప్రభుత్వం సరిగ్గా నిర్వహించలేకపోతోందని చెప్పారు. వాటిలో మరణ మృదంగం మోగుతోందని అన్నారు. ఆహార కల్తీ, ఆత్మహత్యల వల్ల 130 మందికి పైగా విద్యార్థులు మరణించారని గుర్తు చేశారు. అంబేద్కర్‌ను కాంగ్రెస్ రాజకీయ అవసరాలకే వాడుకుందన్నారు. నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ కాలంలో ఆయనకు భారతరత్న ఇవ్వలేదని చెప్పారు. కాంగ్రెసేతర



ప్రభుత్వం వచ్చినప్పుడే ఆయనకు ఆ గౌరవం దక్కిందని అన్నారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఆయన ఫొటో పెట్టడానికి కూడా కాంగ్రెస్ ఒప్పుకోలేదన్నారు. దళిత బంధు కింద కేసీఆర్ రూ.10 లక్షలు ఇస్తే, అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని చెప్పారు. ఆ పథకాన్ని అమలు చేయకుండా దళితులను, అంబేద్కర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానిస్తోందని అన్నారు. నిధులు విడుదల చేయకపోవడం వల్ల ఓవర్సీస్ పథకం కింద విదేశీ విద్యను అభ్యసించే విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి నెలకొందన్నారు. ఈనెల 27న బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం, జగిత్యాలలో బహిరంగ సభ తర్వాత మే, జూన్‌లో ఎస్సీ, ఎస్టీల కోసం సభలు పెడతామని తెలిపారు. కాంగ్రెస్ హామీలు, వివిధ డిక్లరేషన్ల అమలు కోసం పకడ్బందీగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. అంబేద్కర్ కొందరివాడు కాదనీ, అందరివాడనీ, మహాత్మా గాంధీతో సమానమని అన్నారు. జై భీమ్, జై తెలంగాణ, జై కేసీఆర్ అనే నినాదంతో ముందుకు పోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, వి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో దళితులు అభ్యున్నతికి పెద్దపీట

**మొదటిపేజీ తరువాయి**

అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారానే సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో బడుగు, బలహీన వర్గాలే ముఖ్య పాత్ర పోషించాయన్నారు. పాటతో ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన గద్దర్, జయ జయహే తెలంగాణ గీతాన్ని రాసిన అందేశ్రీ పాత్రలను మరిచిపోతారని ఎవరైనా అనుకుంటే అది వారి భ్రమే అవుతుందని నొక్కి చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత జరిగిన పదేండ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీలకు దక్కని ఎన్నో అవకాశాలు రెండేండ్లలో కల్పించామని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రితో పాటు ఐదుగురికి మంత్రి వర్గంలో స్థానం కల్పించామన్నారు. స్పీకర్‌గా, ఎమ్మెల్సీలుగా, విప్‌లుగా, కార్పొరేషన్ చైర్మెన్లుగా పదవులు దక్కాయని వివరించారు. దళిత బిడ్డ స్పీకర్‌గా ఉన్నారని అసెంబ్లీకి రాకుండా కొందరు అవమానిస్తున్నారని విమర్శించారు. ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రులుగా దళితులు ఉండొద్దా అని సీఎం ప్రశ్నించారు. దళితులను అవమానపర్చిన వారే ఒకసారి మైక్ ఇవ్వండి అని అడిగేలా ఈ ప్రభుత్వం చేసిందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు చేరువ చేశామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. "ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు 40 శాతం, డైట్ చార్జీలు 200 శాతం పెంచిన ఘనత తమ ప్రభుత్వానిది. కులాల అంతరం తొలగిపోవాలని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నాం. పేదలకు విద్య అందాలన్న అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తున్నాం. నాణ్యమైన విద్య అందించాలన్న ఆశయంతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను తీసుకొస్తున్నాం. పేదలకిచ్చిన 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లల్లో ఎక్కువగా దళితులు, గిరిజనులే ఉన్నారు. 67 వేల ఉద్యోగాలిచ్చాం. అందులో 87 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు లభించాయి. మేం నిరంతరం పనిచేస్తుంటే.. వెనక నుంచి కొందరు కుట్రలు చేసి, గోతులు తవ్వుతున్నారు. అలాంటి వారిని ఆ గోతిలోనే పాతిపెట్టే పని ప్రజలే చేయాలి. పదేండ్ల విధ్వంసాన్ని సరిచేస్తూ ముందుకెళుతున్నాం. పెద్ద పెద్ద ప్రసంగాలు చేసిన నాయకులు ఒక్కసారైనా అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారా ఆలోచించండి. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంలో కలిసి రండి" అని ప్రజలకు సీఎం విజ్ఞప్తి చేశారు. కేంద్రం ఆదేశాలు పాటించినందుకు దక్షిణాది మూల్యం చెల్లిస్తుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు.

### డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం

బీజేపీ ప్రతిపాదిత డీలిమిటేషన్‌తో ఈ ప్రాంతానికి తీరని అన్యాయం జరుగుతుందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. 50 శాతం సీట్లు పెంపును విరమించుకోవాలని కేంద్రానికి సూచించారు. ఈ ప్రాంతం నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న వారికి డీలిమిటేషన్ వల్ల జరిగే నష్టం తెలియక పోవడం శోచనీయమన్నారు. మహిళా రిజర్వేషన్ పేరుతో డీలిమిటేషన్ బిల్లును సైతం ఆమోదింపజేసే ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. మంచి పనికి మా ప్రభుత్వం ముందుంటుందన్నారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం చివరి వరకు పోరాడిన యోధుడు అంబేద్కర్ అని అన్నారు. అలాంటి మహనీయున్ని ఇటీవల కొందరు పార్లమెంట్‌లో అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలాంటి వారందరం ఆయన కల్పించిన హక్కులతోనే ఎదిగామని గుర్తు చేశారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాలందరికీ విద్య అందాలనే అంబేద్కర్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనం అందించే అసలైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామెల్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, ప్రొఫెసర్ కోదండరామ్, కార్పొరేషన్ చైర్మెన్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన దళిత, అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి 'బంట్రోతు' వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్

**తెలుగు ప్రజలను బంట్రోతులుగా చూసిందే కాంగ్రెస్ పార్టీ అని ఆగ్రహం**

**ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంచుతామన్నా రాద్ధాంతం ఏమిటని ప్రశ్న**

**వెంకయ్యనాయుడు, సీపీ రాధాకృష్ణన్ దక్షిణాదివారు కాదా అని ప్రశ్న**

**ఏప్రిల్ 14(జర్నలిస్ట్ వార్త);** నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులపై ఆయన మీడియాతో మాట్లాడుతూ, పునర్విభజన జరిగితే ఇప్పుడు వచ్చిన కేంద్రమంత్రి పదవులు కూడా రాబోవని, బంట్రోతులుగా మారుతారని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేశారు.

తెలుగు ప్రజలను బంట్రోతులుగా చూసిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. అంజయ్య, ఇతర ముఖ్యమంత్రులను కాంగ్రెస్ పార్టీ ఎలా అవమానించిందో అందరికీ తెలుసని అన్నారు. జనాభా ప్రాతిపదికన పెంచితే దక్షిణాదికి నష్టమని ఇన్నాళ్లు అన్నారని, ప్రతి రాష్ట్రంలో కనీసం 50 శాతం సీట్లు పెంచుతుంటే కూడా రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దక్షిణాదికి బీజేపీ కీలక పదవులు ఇవ్వలేదని రేవంత్ రెడ్డి చెప్పిన వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి స్పందించారు.

ఉపరాష్ట్రపతి పదవులు చేపట్టిన వెంకయ్యనాయుడు, సీపీ రాధాకృష్ణన్ దక్షిణాదివాళ్లు కాదా అని ప్రశ్నించారు. ఎంపీ లక్ష్మణ్ ఉత్తరాదికి వలసపోతారని విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్ వదిలిపెట్టి కేరళకు రాలేదా అని నిలదీశారు. దక్షిణాది ముఖ్యమంత్రులు ఢిల్లీకి వెళితే రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి రేవంత్ రెడ్డి పంపించే డబ్బుతోనే కాంగ్రెస్ పార్టీ నడుస్తోందని విమర్శించారు.

జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాది నష్టపోతుందనే ఆలోచనతో మోదీ రాష్ట్రాలకు కనీసం 50 శాతం సీట్లు పెంపు ప్రతిపాదన తీసుకువచ్చారని తెలిపారు. కానీ గతంలో ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు కేటాయించింది కాంగ్రెస్ పార్టీయేనని ఆరోపించారు. ఈసారి జనగణనతో పాటు కులగణన చేస్తున్నట్లు చెప్పారు. దీనికి సమయం తీసుకుంటుందని కిషన్ రెడ్డి అన్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వండి

**మొదటిపేజీ తరువాయి**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షను అందరూ కలిసికట్టుగా బలపరచాలని తన లేఖలో చంద్రబాబు గట్టిగా విజ్ఞప్తి చేశారు.ఈ నెల 16న పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లును ప్రవేశపెట్టడం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచిపోతుందని చంద్రబాబు తన లేఖలో అభిప్రాయపడ్డారు. "మహిళా రిజర్వేషన్ బిల్లుపై విస్తృతంగా చర్చలు జరిగాయి. త్వరితగతిన ఈ చారిత్రక చట్టం అమల్లోకి రావాలన్న ఏకాభిప్రాయం కూడా నాడు వ్యక్తమైంది. ఇందులో భాగంగా 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్లు అమలు కావాలన్న ప్రధాని నరేంద్ర మోదీ గారి ఆకాంక్షకు మనందరం మద్దతు పలుకుదాం" అని ఆయన కోరారు.

ఈ అంశం రాజకీయాలకు అతీతమైనదని, దేశ గౌరవానికి సంబంధించిన విషయమని చంద్రబాబు స్పష్టం చేశారు. "మహిళా రిజర్వేషన్ పై అంతా ఒకే స్వరం వినిపించాలని ఆడబిడ్డల తరుపున బాధ్యతతో ఈ లేఖ రాస్తున్నాను. మన ఇంటి ఆడబిడ్డలను, మన దేశ మహిళలను గౌరవించుకునే ఈ అవకాశాన్ని మనందరం అదృష్టంగా భావిద్దాం. ఈ పవిత్ర ఘట్టంలో భాగస్వామి అయ్యే సందర్భాన్ని ఎవరూ వదులుకోవద్దు" అని ఆయన హితవు పలికారు. ప్రతీ పార్టీ, ప్రతీ ఎంపీ ఈ చారిత్రాత్మక నిర్ణయంలో తమదైన ముద్ర వేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు.

ప్రభుత్వంలో, పరిపాలనలో, చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుందని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. 'నారీ శక్తి వందన్ అధినియమ్' కేవలం మహిళా సాధికారతకే కాకుండా, యావత్ దేశ ఉన్నతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. భరతమాతను పూజించే మన దేశంలో, నారీ శక్తికి వందనం పలికే ఈ గొప్ప క్షణాలకు 140 కోట్ల మంది భారతీయులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని చేకూర్చడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రధాని మోదీని, కేంద్ర ప్రభుత్వాన్ని సమష్టిగా బలపరచాలని చంద్రబాబు తన లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

---

# బీహార్ కొత్త సిఎంసమ్రాట్ చౌధరీ

**పాట్నా,ఏప్రిల్ 14(జర్నలిస్ట్ వార్త);** బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ఎంపికయ్యారు. దాదాపు రెండు దశాబ్దాలు పాటు బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న నితీష్ కుమార్ మంగళవారం రాజీనామా చేశారు. దీంతో బిహార్‌లో అత్యున్నత పదవిని అధిరోహించనున్న తొలి బీజేపీ నేతగా సమ్రాట్ చౌధరీ నిలిచారు. బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటివరకు బిహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న 57 ఏళ్ల సమ్రాట్ ఓబీసీ వర్గమైన కుష్వాహా కులానికి చెందినవారు. బిహార్‌లోని ఓబీసీ కులాలలో యాదవుల తర్వాత కుష్వాహా వర్గమే అతి పెద్దది ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగిన నితీష్.. కుష్వాహా కులానికి చెందిన వ్యక్తినే తదుపరి సీఎంగా ప్రకటించాలని షరతు విధించినట్టు సమాచారం. నితీష్ సలహా మేరకే బీజేపీ.. సమ్రాట్‌కు సీఎం పీఠం అప్పగించినట్టు తెలుస్తోంది. మధ్యలో కొన్ని సంవత్సరాలు మినహా 2005 నుంచి బీజేపీ, బిహార్ ప్రభుత్వంలో మైనర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. 20 సంవత్సరాల తర్వాత బీజేపీకి చెందిన నేత బిహార్ సీఎం అయ్యారు. 243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీలో నితీష్ కుమార్ పార్టీకి 85 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 89 మంది ఉన్నారు. కాగా, బిహార్ కొత్త సీఎం అయిన సమ్రాట్ చౌధరీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి . ఆయన మొదట ఆర్జేడీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆ తర్వాత జేడీ (యు)లో చేరారు. ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నాయకుడిగా ఎదిగారు. ఈ రకంగా ఆయనకు బిహార్‌లోని మూడు ప్రధాన పార్టీల్లో పని చేసిన అనుభవం ఉంది. దాదాపు రెండు దశాబ్దాల పాటు బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగిన నితీష్ కుమార్ రాజీనామా చేశారు. పట్నాలో తన చివరి కేబినెట్ సమావేశానికి అధ్యక్షత వహించిన అనంతరం ముఖ్యమంత్రి పదవి నుంచి నితీష్ వైదొలిగారు. దీంతో తమ నాయకుడిని ఎన్నుకోవడానికి ఎన్డీయే శాసనసభ పక్షం సమావేశం అయ్యింది. కేంద్ర పరిశీలకుడిగా నియమితుడైన మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ సమావేశానికి హాజరు అయినట్లు సమాచారంద

# సమ్మె యోచన విరమించండి

**మా తలుపులు తెరిచే ఉన్నాయి**

**ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి**

**హైదరాబాద్,ఏప్రిల్ 14(జర్నలిస్ట్ వార్త);** ఆర్టీసీ పరిరక్షణ – ప్రజల ప్రయోజనాల దృష్ట్యా సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులకు తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుందామని సంస్థ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.సమస్యలు చెప్పుకోవడానికి తమ తలుపులు తెరిచే ఉన్నాయి.. ఎవరైనా వచ్చి తమ సమస్యలు చెప్పుకోవచ్చునని ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల అంశాలు ప్రభుత్వ పరిధిలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి ఏర్పాటు చేసిన కమిటీ పని చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. తమ డిమాండ్ల నెరవేరని పక్షంలో ఏప్రిల్ 22వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ సోమవారం ప్రకటించింది. 21వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ బస్సులు నిలిపి వేస్తామని స్పష్టం చేసింది. 22వ తేదీ తెల్లవారుజాము నుంచి సమ్మెలోకి వెళ్తామని పేర్కొంది. సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని కార్మిక శాఖ కార్యాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో ఆర్టీసీ జేఏసీ నేతలు సమావేశమయ్యారు. అనంతరం ఆర్టీసీ జేఏసీ నేతలు మాట్లాడుతూ.. ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఆర్టీసీ సంస్థ నుంచి అధికారులు రాలేదని స్పష్టం చేశారు. అయితే ఆర్టీసీ యాజమాన్యం నుంచి లేఖ మాత్రం వచ్చిందన్నారు. కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిధిలో ఉన్నాయని ఈ సందర్భంగా యాజమాన్యం స్పష్టం చేసిందని చెప్పారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాలకు ఎన్నికలు సహా మరో 30 డిమాండ్లతో సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ నేతలు ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పైవిధంగా స్పందించారు.

## జేఏసీ ఆధ్వర్యంలో తల్లాడలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**తల్లాడ/, ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ వార్త):**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం తల్లాడలోని అంబేద్కర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ మండలాధ్యక్షులు మాగంటి శివన్ మహారాజ్, జిల్లా నాయకులు మేడి బసవయ్య అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేద్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అన్ని వర్గాల అభ్యున్నత కోసం అంబేద్కర్ అనేక పోరాటాలు చేసి సమానత్వానికి మార్గం చూపిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సాధన కమిటీ సభ్యులు నారపోగు ప్రసాద్, రావుల గోపి గౌడ్, రేగళ్ల శ్రీనివాసరావు, ఇస్నపల్లి వెంకటేశ్వర్లు, బోనాసి శ్రీనివాసరావు, గొడ్ల వెంకటరత్నం, కాంపాటి రవి, గొడ్ల రాంబాబు, తాళ్లూరు రాజా తదితరులు పాల్గొన్నారు.



## యాదన్న యువసేన ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ



**ఎల్కతుర్తి,/ ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ వార్త):**మండలంలోని జగన్నాథపూర్, జీలుగుల గ్రామాలకు చెందిన యువజన నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని యాదన్న యువసేన ఆధ్వర్యంలో ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీలో యువత భారీ సంఖ్యలో డీజే సౌండ్స్‌తో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూత్ నాయకుడు పెండ్యాల లోకేష్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను యువతలో చాటిచెప్పేందుకు ఈ బైక్ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదన్న యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్యాల లోకేష్, గ్రామ అధ్యక్షుడు పంజాల అభిలాష్ గౌడ్ పాల్గొన్నారు. వారితో పాటు యువజన సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ బైక్ ర్యాలీ జగన్నాథపూర్ గ్రామం నుంచి ప్రారంభమై మండల కేంద్రంలోని అంబేద్కర్ పార్క్ వరకు అంబేద్కర్ జెండాలతో కొనసాగింది. ర్యాలీలో సుమారు 200 మంది యువజన నాయకులు, విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.ం

## జిల్లా కాంగ్రేస్ కమిటీ కార్యదర్శిగా కంది కృష్ణచైతన్య రెడ్డి



**నర్సంపేట/, ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ వార్త):**
వరంగల్ జిల్లా కాంగ్రేస్ కమిటీ కార్యదర్శిగా చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన కంది కృష్ణచైతన్య రెడ్డి నియమితులయ్యారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆశీస్సులతో ఈ నియామకం జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ గుర్తింపు పొందిన కృష్ణచైతన్య రెడ్డి, ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తన భార్య శ్వేత విజయంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రేస్ పార్టీలో చేరి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తూ వస్తున్నారు. యువకుడిగా, ఉత్సాహవంతుడిగా పార్టీ కోసం పనిచేస్తున్న కృష్ణచైతన్య రెడ్డి సేవలను గుర్తించిన పార్టీ నాయకత్వం ఆయనకు జిల్లా కార్యదర్శి పదవి బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, నియోజకవర్గ నాయకులు, మండల నాయకులకు కృష్ణచైతన్య రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కాంగ్రేస్ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## ఎండలకు ఉపశమనం

### - తల్లాడలో చలివేంద్రం ప్రారంభం



**తల్లాడ/, ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ వార్త):**
వేసవి ఎండలు మండిపోతున్న వేళ బాటసారులకు, ప్రజలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో తల్లాడ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ సముదాయం ఎదురుగా, మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పి. నాగేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ కరుణాకర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీధర్ రాజు, ఈవో కృష్ణారావు, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, పీఆర్ డీఈఈ, పీఆర్ ఏఈ, మిషన్ భగీరథ ఏఈ సింధు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూడ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీరు అందించేలా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సర్పంచ్ పి. నాగేశ్వరరావు ప్రజల పట్ల చూపుతున్న శ్రద్ధ ఇతరులకు ఆదర్శమని కొనియాడారు. ఎంపీడీవో శ్రీధర్ రాజు మాట్లాడుతూడ కార్యాలయాలకు వచ్చే ప్రజలు, బాటసారులకు ఇది ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అలాగే బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో కూడా స్వచ్ఛంద సంస్థల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ మైనర్ బాలికపై అత్యాచారం

### నలుగురిపై కేసు నమోదు

**భీమదేవరపల్లి/ఏప్రిల్14 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ దివ్యాంగ మైనర్ బాలికపై అత్యాచారం జరిగిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు శివతో పాటు అతనికి సహకరించిన అతని స్నేహితులు మణికంఠ, వేణు, టోనీపై కూడా కేసులు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, మల్లారం గ్రామానికి చెందిన వీరందరూ ఈ దారుణానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధిత బాలికపై జరిగిన ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ విషయమై ముల్కనూర్ ఎస్ఐ రాజు మాట్లాడుతూ, నిందితులపై చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## గట్లనర్సింగాపూర్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు



**భీమదేవరపల్లి/ఏప్రిల్14 (జర్నలిస్ట్ వార్త):**
భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలో మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్, ముల్కనూర్ ఎస్ఐ రాజు, ఉపసర్పంచ్ బోడిగే శ్రీనివాస్‌లు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు.
అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను కొనసాగించారు. గ్రామంలో తొలిసారిగా దాతల సహకారంతో గ్రామ యువత ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పెద్దబోయిన రమాదేవి హరికృష్ణ, మెరుగు శోభకుమార్, సంగ అయిలయ్య, మాడ్గుల అమర్‌నాథ్, అంగిడి రాజమ్మ, మంద పద్మశ్రీధర్, మొలుగు కవిత కిరణ్ పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొల్లంపల్లి సుకుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పొన్నాల మురళి, కాంగ్రెస్ మహిళా నాయకురాలు కవ్వంపెల్లి స్వర్ణలత, మాజీ ఎంపీటీసీ మోరే సంజీవ్, కనకం కిషోర్, చుంచు సంతోష్, బొల్లంపల్లి సుశాంత్ పాల్గొన్నారు. ఇతరంగా అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై అంబేద్కర్ జయంతిని విజయవంతం చేశారు.

# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు






**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 14:**
(జర్నలిస్టు వార్త)మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శాంతి సాగర్ మాదిగ ఆధ్వర్యంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు, యువత, అంబేద్కర్ వాదులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న గంగారపు శ్రీనివాస్ (ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి), మాచర్ల జ్యోతి (గ్రామ సర్పంచ్) అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ ఆశయాలను స్మరించుకుంటూ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గంగారపు శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా మాత్రమే కాకుండా సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. మహిళల సమాన హక్కుల కోసం ఆయన ప్రవేశపెట్టిన హిందూ కోడ్ బిల్లులో ఆస్తి హక్కు, కులాంతర వివాహ హక్కు, విడాకుల హక్కు, దత్తత హక్కు వంటి కీలక అంశాలు ఉన్నాయని తెలిపారు. మహిళలకు సమాన స్థానం కల్పించాలనే దృఢ సంకల్పంతో అంబేద్కర్ ఈ బిల్లును ప్రవేశపెట్టారని చెప్పారు. అయితే అప్పటి పార్లమెంట్‌లో ఉన్న మెజారిటీ సభ్యులు ఆ బిల్లుకు వ్యతిరేకంగా నిలవడంతో అది అమలులోకి రాలేదని, ఆ నిర్ణయానికి నిరసనగా అంబేద్కర్ తన న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయడం ఆయన సూత్రనిష్ఠకు నిదర్శనమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం నెలకొల్పేందుకు, కులవివక్ష నిర్మూలన కోసం అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికై అహర్నిశలు కృషి చేసిన అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, సమసమాజ స్థాపన కోసం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్ తదితర రాజకీయ, సామాజిక సంస్థల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా అంబేద్కర్ నినాదాలతో ప్రాంతం మార్మోగింది.

## ఘనంగా ప్రపంచ మేధావి డా. బీ.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు





**ఎల్కతుర్తి,/ ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ వార్త):**
భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డా. బీ.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఎల్కతుర్తి మండల కేంద్రంతో పాటు దామెర, గోపాల్పూర్, దండేపల్లి, సూరారం తదితర గ్రామాలలో ఘనంగా నిర్వహించబడ్డాయి.
బహుజన మహనీయుల జయంతి వర్ధంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ అంబాల సుమన్, ప్రధాన కార్యదర్శి బొంకురి కార్తీక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో అంబేద్కర్ జయంతిని అత్యంత వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని డా. బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి స్థానిక సీఐ పులి రమేష్, ఎస్సై ప్రవీణ్ కుమార్‌తో పాటు పోలీస్ సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీస్ అధికారులు మాట్లాడుతూ అంబేద్కర్ ఎన్నో అవమానాలను ఎదుర్కొని, దళితుల హక్కుల కోసం పోరాడి, వారి అభ్యున్నతికి రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడని కొనియాడారు. ఈ సందర్భంగా చింతలపల్లి, ఎల్కతుర్తి గ్రామాలకు చెందిన మహిళా సర్పంచులు రజిత, లావణ్య మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి అంబేద్కర్ చూపిన మార్గమే కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో వివిధ గ్రామాల సర్పంచులు, రాజకీయ పార్టీల నాయకులు, అంబేద్కర్ వాదులు, యువజన సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి





### మార్నేని రవీందర్ రావు

**ఐనవోలు/ఏప్రిల్ 14(జర్నలిస్ట్ వార్త);**
భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మంగళవారం హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు – మధుమతి దంపతులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానికులకు పండ్లను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా మార్నేని రవీందర్ రావు మాట్లాడుతూ దేశానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని, ఆయన రచించిన రాజ్యాంగం వల్లనే నేడు అన్ని వర్గాలకు సమాన హక్కులు లభిస్తున్నాయని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బరిగల భాస్కర్, వార్డు సభ్యులు కొత్తూరి అనిల్, రంగు శీను, బరిగల భరత్ (కన్ని), కుమార్‌మాజీ ప్రజా ప్రతినిధులు మాజీ సర్పంచ్ జన్ను కుమారస్వామి, మాజీ డైరెక్టర్ చింత బాబుజిల్లా నాయకులు చందర్ రెడ్డి, రమేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఏలియా, మురళి, కుమారస్వామి ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొని బాబాసాహెబ్ అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించారు.

# తల్లాడలో అంబేద్కర్ భవనం ప్రారంభం






**తల్లాడ/, ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిషత్ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ భవన్ కమ్యూనిటీ హాల్‌ను మంగళవారం రాష్ట్ర రెవిన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఘనంగా ప్రారంభించారు. సుమారు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ భవనాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధనలో భాగంగా ఇలాంటి కమ్యూనిటీ హాల్స్ సామాజిక ఐక్యతకు వేదికలవుతాయని తెలిపారు. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ సాధన కమిటీ సభ్యులతో ఆయన కొద్దిసేపు ముచ్చటించి, వారి కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొట్టేటి జనార్దన్ రెడ్డి, దగ్గుల రఘుపతి రెడ్డి, సర్పంచ్ ఎక్కిరాల శేషమ్మ, ఐలూరి బాబురెడ్డి, గంట వెంకటచారి, హెచ్‌డీ కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సాధన కమిటీ సభ్యులు నారపోగు ప్రసాద్ బాబు, రాహుల్ గోపయ్య గౌడ్, మేడి బసవయ్య, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, గొడ్ల వెంకటేశ్వర్లు, వెంకటరత్నం, బోనాసి శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు, శివ మహారాజ్, వెంకటేశ్వరరావు మరియు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు





**నర్సంపేట, ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ కూడలి వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్, మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, ఏసీపీ రవీందర్ రెడ్డి, పట్టణ సీఐ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమాన అవకాశాలతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఒక వర్గానికి మాత్రమే చెందిన నాయకుడు కాదని, సమాజమంతటికీ మార్గదర్శకుడని అన్నారు. ఆయన చూపిన సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే విలువలను అందరూ ఆచరించాలని సూచించారు. యువత అంబేద్కర్ వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత విద్యను అభ్యసిస్తూ, సామాజిక న్యాయం కోసం కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

# మల్లక్‌పల్లి గ్రామంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**ధర్మసాగర్/ ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ వార్త):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ధర్మసాగర్ మండలంలోని మల్లక్‌పల్లి గ్రామంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నరపు మహేందర్ మాట్లాడుతూ అంబేద్కర్ గారు బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రపంచ మేధావి అని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఎన్నో చట్టాలు సాధించి, పేద ప్రజలకు అండగా నిలిచారని అన్నారు. ప్రభుత్వం చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికుల సంక్షేమానికి అంబేద్కర్ చేసిన కృషి అపారమని, 12 గంటల పనిదినాన్ని 8 గంటలకు తగ్గిస్తూ కార్మికులకు న్యాయం చేసిన మహానుభావుడని కొనియాడారు. వెట్టి చాకిరి నిర్మూలనలో ఆయన పాత్ర విశేషమని చెప్పారు. స్త్రీల హక్కులు, వ్యవసాయ రంగం, కార్మిక చట్టాలు తదితర రంగాల్లో అమూల్యమైన సేవలు అందించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని తెలిపారు.

ఇలాంటి మహనీయుడికి ప్రతి భారతీయుడు రుణపడి ఉంటాడని పేర్కొంటూ కార్మిక సంఘాల తరఫున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గిన్నరపు లత, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. యూత్ సంఘం అధ్యక్షుడు బైరపాక ఏలీయా, కార్యదర్శి గిన్నరపు రవి, యువజన అధ్యక్షుడు తాటియాల హానోక్ తదితరులు హాజరయ్యారు.

# నేడు తల్లాడలో పాస్టర్ల సమావేశం



**తల్లాడ/, ఏప్రిల్ 14 జర్నలిస్ట్(వార్త):** తల్లాడ మండలంలోని ఐక్య పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో పాస్టర్ల సమావేశం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు తల్లాడలో నిర్వహించనున్నట్లు సంఘం బాధ్యులు కే. ఇశ్రాయేలు, దారెల్లి తిమోతి, సంఘసాని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూడ ఎస్సీలు క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సీ హోదా రద్దవుతుందన్న సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఆ తీర్పుపై చర్చలు జరిపేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. క్రైస్తవుల సమస్యలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రభావం, అనుసరించాల్సిన వ్యూహాలు, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో సమగ్రంగా చర్చించనున్నట్లు తెలిపారు. తల్లాడ మండలంలోని పాస్టర్లు అందరూ ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. ప్రతి పాస్టర్ తమ సంఘానికి చెందిన సుమారు 10 మంది సభ్యులతో సమావేశానికి రావాలని సూచించారు.

# అంబేద్కర్ కొందరివాడు కాదు.. అందరివాడు

## : ఝాన్సీ రెడ్డి



**రాయపర్తి/, ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ వార్త):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కొందరి వాడు కాదని, సమస్త ప్రజల వాడని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ వంటి మహత్తర విలువలను అందించిన మహనీయుడని కొనియాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. విద్య, ఐక్యత, చైతన్యం ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని ఆమె సూచించారు. అనంతరం అంబేద్కర్ అవార్డు గ్రహీత చిర్ర మల్లయ్యను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గారే సామెంద్ర బిక్షపతి, టీపీసీసీ మాజీ కార్యదర్శి బిల్లా సుదీర్ రెడ్డి, వర్ధన్నపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్, ఆకుల సురేందర్ రావు, రెంటాల గోవర్ధన్ రెడ్డి, ఊళ్లేంగుల యాదగిరి, పాల్వంచ కోటేశ్వర్, ఎండీ నయీమ్, కాంచానపల్లి వనజరాణి, కుంట రమేష్, ఎండీ ఉస్మాన్, మచ్చ రమేష్, ఎండీ అఫ్రోజ్, ఎస్కే రఫీక్, పెండ్లి మహేందర్ రెడ్డి, మాల్యాల నర్సింహామూర్తి, పిరని ప్రవీణ్, చిర్ర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ కార్యాలయంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**ఖమ్మం/, ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకుడు వనమా వాసు మాట్లాడుతూడ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా, గొప్ప సంఘ సంస్కర్తగా దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. 'బాబాసాహెబ్'గా ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించిన అంబేద్కర్ అంటరానితనం, కుల వివక్షకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. స్వతంత్ర భారతదేశపు తొలి న్యాయశాఖ మంత్రిగా ఆయన సేవలు దేశానికి మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, ఓటు హక్కు, విద్య హక్కులు వంటి అనేక మానవ హక్కుల సాధన కోసం అంబేద్కర్ జీవితాంతం కృషి చేశారని, ఆయన ఆశయాలను అందరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొండబాల కర్ణాకర్, కేతినేని హరీష్, వనమా వాసు, మల్లెంపాటి అప్పారావు, వాసిరెడ్డి భాస్కరరావు, నాగార్జున శ్రీనివాస్, చుండూరు రాజరాజేశ్వరి, మందడపు సుధాకర్, రాయల కోటేశ్వరరావు, పాలడుగు కృష్ణ ప్రసాద్, గడిపుడి వెంకటేశ్వర్లు, బోయిన వెంకన్న, నామా ఉపేందర్, కర్నాటి అశ్వినీ కుమార్, బోడేపూడి రవి, వాడపల్లి బిక్షపతి, పెమ్మసాని హరీష్, దివాకర్, పరిటాల నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు. -సీఐ రవీందర్.




**బయ్యారం/,ఏప్రిల్ 14.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీస్ శాఖ అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ప్రమాదకరమైన మలుపులు, బ్లాక్ స్పాట్స్ వద్ద హెచ్చరిక సూచిక బోర్డులను జిల్లా ఎస్పి డాక్టర్ శబరిష్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. బయ్యారం పోలీసుల ఆధ్వర్యంలో రోడ్లకు అడ్డుగా ఉన్న చెట్ల పొదలను తొలగించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా గార్ల బయ్యారం సీఐ రవీందర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతలో ప్రజల సహకారం అత్యంత ముఖ్యమని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, మరణాల రేటును నియంత్రించడం లక్ష్యంగా బయ్యారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో రోడ్ల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బయ్యారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గట్టుముసలమ్మ గుడి నుంచి పంది పడే గ్రామం వరకు రోడ్లపై అడ్డంగా ఉన్న చెట్ల పొదలను తొలగించడం ద్వారా ప్రమాదాలను తగ్గించే చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు. ఎస్ఐ తిరుపతి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన పెంపొందించినట్లు తెలిపినారు. మండలం లోని పంచాయితీలలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాల వద్దా రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని ప్రమాణం చేపించారు.

## అంబేద్కర్ భవన నిర్మాణానికి

# రూ. 5 లక్షల విరాళం

**-నిమ్మాని శేఖర్ రావు దాతృత్వాన్ని కొనియాడిన కలెక్టర్, ఎమ్మెల్యే**

**- ఘనంగా బాబాసాహెబ్ 135వ జయంతి వేడుకలు**



**వరంగల్ బ్యూరో /ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్ నగరంలోని కేఎంసీ ఎన్.ఆర్.ఐ ఆడిటోరియంలో మంగళవారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవిలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ శ్రీ నిమ్మాని శేఖర్ రావు కీలక ప్రకటన చేస్తూ, వరంగల్‌లో నిర్మించనున్న అంబేద్కర్ భవనానికి తన వంతు సహాయంగా రూ. 5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. సమాజ శ్రేయస్సు కోసం ఆయన చూపుతున్న ఉదారతను కలెక్టర్, ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం శేఖర్ రావు ని శాలువాతో ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. నిమ్మాని శేఖర్ రావు దాతృత్వం పట్ల దళిత సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. భవన నిర్మాణానికి ఇంత పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం అందించడం పట్ల ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ప్రముఖ నాయకులు బిర్రు మహేందర్, మన్నె బాబురావు, చిలువేరు శ్రీనివాస్ తదితర అధికారులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేద్కర్ చూపిన మార్గంలో నడవాలి

## వంగర గ్రామంలో ఉత్సాహంగా అంబేద్కర్ జయంతి



**భీమదేవరపల్లి/ఏప్రిల్14 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ సంఘం గ్రామ అధ్యక్షుడు, 8వ వార్డు సభ్యుడు గజ్జల సురేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులు ఘటించారు. అనంతరం గ్రామస్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. అంబేద్కర్ గారు ఒక వర్గానికి, ఒక కులానికి, ఒక మతానికి మాత్రమే చెందినవారు కాదని, సమస్త భారత ప్రజల నాయకుడని ప్రసంగకర్తలు పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ, విద్యను అభ్యసించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్జల సురేష్, మాట్ల వెంకటస్వామి మాదిగ, కండె రమేష్, మాజీ సర్పంచ్ మంచాల వెంకటస్వామి, మంచాల శ్రీనివాస్, కడారి బాబు, కండి చక్రపాణి, కండె సంజీవ్, రొడ్డ వీరస్వామి, గిన్నారపు కుమార్ స్వామి, మిరుదొడ్డి తిరుపతి, వేముల రమేష్, శ్రావణ్ కుమార్, రొడ్డ సంపత్, మహేష్, రాజు, కుమారస్వామి, మెరుగు శ్రీకాంత్, మాట్ల కుమారస్వామి, మాట్ల అశోక్, సతీష్, మల్లమరి శ్రీనివాస్, అంబాల అనిల్, గజ్జల సంపత్, మంచాల సదానందం, ప్రవీణ్, మహేష్, హరీష్, మాట్ల అక్షయ్, కడారి రణధీర్, మాట్ల నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం చేయూత

## విషపురుగుల నుంచి రక్షణకు షూస్ పంపిణీ



**భీమదేవరపల్లి/ఏప్రిల్14 (జర్నలిస్ట్ వార్త):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఎస్సీ రైతులకు రక్షణ షూస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ పాల్గొని షూస్ అందజేశారు. రైతులు పొలాల్లో పనిచేసే సమయంలో పాములు, తేళ్ల నుంచి రక్షణకు ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ప్రశాంతి, కీటక శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి, బి.సి.ఐ అసిస్టెంట్ మేనేజర్ రామారావు, క్షేత్ర సిబ్బంది రఘు, తిరుపతి, సాయికిరణ్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు

# అంబేద్కర్ అందరివాడు

## :కొట్టే ప్రవీణ్



**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు, మాజీవిజిలెన్స్ కమిటీ సభ్యుడు కొట్టే ప్రవీణ్ పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కొట్టే ప్రవీణ్ మాట్లాడుతూ అంబేద్కర్ ఒక వర్గానికే పరిమితి కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరికీ చెందిన మహనీయుడని అన్నారు. ఆయన ఆలోచనలు, ఆశయాలు సమానత్వం, సామాజిక న్యాయం సాధనకు మార్గదర్శకమని పేర్కొన్నారు.అంబేద్కర్ చూపిన దారిలో నడుస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ధర్మసాగర్‌లో కొట్టే సహకార సంఘం ఆధ్వర్యంలో

# అంబేద్కర్ జయంతి వేడుకలు





**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 14: (జర్నలిస్ట్ వార్త)** కొట్టే సహకార సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి సంఘం అధ్యక్షులు కొట్టే ఏసేపు పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం దేశ ప్రజలకు సమాన హక్కులు, సామాజిక న్యాయం కల్పించిందని తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి అపారమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘం సభ్యులు, కమిటీ సభ్యులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# నెమ్మదిగా వెళ్లండి.. ప్రాణాలు కాపాడుకోండి.

## గీసుకొండ పోలీసుల ముందడుగు - రహదారి భద్రతపై అవగాహన




**గీసుకొండ/ఏప్రిల్ 14(జర్నలిస్ట్ వార్త):** రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా గీసుకొండ పోలీసులు వినూత్న చర్యలు చేపట్టారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై వాహనదారులను అప్రమత్తం చేసేందుకు నెమ్మదిగా వెళ్లండి అనే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. మంగళవారం గీసుకొండ సీఐ విశ్వేశ్వర్, ఎస్సై అనిల్ కలిసి ఈ బోర్డులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మితిమీరిన వేగం ప్రాణాంతకమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ఈ బోర్డులను ఏర్పాటు చేశారు.రహదారి వినియోగదారుల్లో బాధ్యతను పెంచడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని అధికారులు పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం చొరవ తీసుకున్న గీసుకొండ పోలీసులపై స్థానికులు, వాహనదారులు ప్రశంసలు కురిపిస్తున్నారు. వేగం కన్నా ప్రాణం ముఖ్య మని ప్రతి వాహనదారుడు తమ కుటుంబ సభ్యుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిదానంగా ప్రయాణించాలని గీసుకొండ సీఐ విశ్వేశ్వర్ సూచించారు.

# ధర్మసాగర్‌లో అంబేద్కర్ జయంతి సందర్భంగా భారీ ర్యాలీ





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ వార్త):**డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ధర్మసాగర్ మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం అంబేద్కర్ వాదులు భారీ ర్యాలీ నిర్వహించారు. నల్ల ధర్మసాగర్ ఎస్సీ కాలనీ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన రహదారి వెంట సాగుతూ అంబేద్కర్ విగ్రహం వరకు ఘనంగా కొనసాగింది.కులమతాలకు అతీతంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు. యువత, మహిళలు, పెద్దలు ఉత్సాహంగా నినాదాలు చేస్తూ అంబేద్కర్ ఆశయాలను ప్రతిధ్వనింపజేశారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ సమానత్వం, న్యాయం, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికై ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కుల వివక్ష నిర్మూలనకు, సమసమాజ నిర్మాణానికి అంబేద్కర్ చూపిన మార్గంలోనే నడవాలని పిలుపునిచ్చారు.ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, యువజన ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జగ్గుతండ పంచాయతీలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు.

## -సర్పంచ్ జయంతి వెంకట కృష్ణ.



**బయ్యారం/,ఏప్రిల్ 14.(జర్నలిస్ట్ వార్త)**
భారతదేశ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి సందర్భంగా జగ్గుతండా గ్రామపంచాయతీలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.జగ్గుతండ సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ,ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం పంచాయతీలో ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీగా వెళుతూ జై భీమ్ అని నినాదాలతో బస్టాండ్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బొల్లి జయంతి మాట్లాడుతూ ఒక సమాజం ఎంత పురోగతి సాధించిందనేది ఆ సమాజంలోని మహిళలు సాధించిన అభివృద్ధిని బట్టే తాను కొలుస్తానన్న అంబేద్కర్ మాటలను ప్రతి ఒక్కరూ మనసా వాచా స్మరించుకోవాలని గుర్తు చేశారు.ప్రతి పౌరుడికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించి, రాజ్యాంగ రక్షణ అందించిన మహనీయుని ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ,బాధ్యత కలిగిన పౌరులుగా జీవించడమే మనం ఆ మహనీయునికి ఇచ్చే అసలైన నివాళి అని జయంతి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గార్ల బయ్యారం సీఐ రవీందర్, ఎస్ఐ తిరుపతి,వార్డు సభ్యులు వట్టం సావిత్రి కంద్రాతి యాకేష్,బానోత్ స్వాతి,మక్కల దుర్గారావు,అంగిరేకుల లలిత,ధర్మాసోత్ కవిత,తేజవత్ రాఘవేంద్ర,పంచాయతీ సెక్రటరీ శ్రీహరి, యువకులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సంతులాల్ పోడ్ తండాలో ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ

## ముఖ్య అతిథిగా విచ్చేసి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య





**బయ్యారం/ఏప్రిల్ 14(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండలం సంతులాల్ పోడ్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఇల్లందు నియోజకవర్గ శాసనసభ సభ్యులు కోరం కనకయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. సమానత్వం , స్వేచ్ఛ:,రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం అనే గొప్ప విలువలను అంబేద్కర్ అందించారని కొనియాడారు. ఒక వ్యక్తి ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే అది కేవలం విద్యతోనే సాధ్యమని, ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఎవరూ తక్కువ కాదని, అందరికీ సమాన హక్కులు ఉండాలనే అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గూగులోత్ మణి, ఉపసర్పంచ్ మట్ల కిషోర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అంబేద్కర్ ఆలోచనలే దిక్సూచి అని పేర్కొన్నారు. చదువుకోండి, సమీకృతం అవ్వండి, పోరాడండి అన్న ఆయన నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని, కులమత భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా ఉండాలని వారు కోరారు.

# బండౌవతాపురంలో అంబేద్కర్ జయంతి వేడుకలు




**వర్ధన్నపేట/ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ వార్త);**
మండల కేంద్రంలో బండౌవతాపురం గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మరుపట్ల వేణు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని దశరథం, ఉప సర్పంచ్ సుకన్య అమరేందర్ ముఖ్య అతిథులుగా పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ కులమత భేదాలు లేని నవభారత నిర్మాణం కోసం అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులే రక్షణ కవచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, యువజన సంఘం నాయకులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్తపేటలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు.



**బయ్యారం/,ఏప్రిల్ 14.(జర్నలిస్ట్ వార్త)**రాజ్యాంగ నిర్మాత,భారతరత్న డా.బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని గంధంపల్లి సెంటర్ లో జిల్లపల్లి పుల్లయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన వేడుకల్లో సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్,సీఐ రవీందర్ ముఖ్య అతిధులుగా పాల్గొని మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జాతికి అంబేద్కర్ చేసిన కృషిని,ఆయన అందించిన విశేష సేవలను ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ నాయక్ స్మరించుకున్నారు.అన్ని రంగాల్లో వివక్ష రహిత సామాజిక సమానత్వం కోసం,వర్ణ,కుల,మత, లింగ బేధాలు లేకుండా భారతదేశ ఔన్నత్యాన్ని నిలిపే దిశగా కృషి చేసిన మహోదార్శనికుడు అంబేద్కర్ అని ప్రవీణ్ నాయక్ కొనియాడారు.భారతదేశ సామాజిక,రాజకీయ,ఆర్థిక, సాంస్కృతిక సంబంధాల్లో మానవీయత ఫరిడవిల్లి..భారత పౌరుడు విశ్వనరుడిగా ఎదిగేందుకు దోహదపడేలా రాజ్యాంగాన్ని నిర్మించిన అంబేద్కర్ ప్రపంచ మేధావి అని గార్ల బయ్యారం సీఐ రవీందర్ కొనియాడారు.దళిత, బహుజన వర్గాల అభ్యున్నతి కోసం,అంబేద్కర్ ఆశయాల సాధన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో విప్లవాత్మక కార్యాచరణను అమలు చేస్తుందని సర్పంచ్ ప్రవీణ్ నాయక్ గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మొత్తంశెట్టి నాగేశ్వరావు, వడ్లమూడి కోటేశ్వరరావు,సర్వయ్య, బాలరాజు,రావి విరభద్రరావు, బొమ్మకంటి రాంబాబు,చల్లా సురేష్, భూక్యా శ్రీను,పెనుగొండ పుల్లయ్య,ప్రశాంత్,రఘుపతి,రంజిత్,గంధంపల్లి కొత్తపేట యువజన సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు బాబాసాహెబ్ బాటలు

## గీసుకొండ సిఐ విశ్వేశ్వర్



**గీసుకొండ/ఏప్రిల్ 14(జర్నలిస్ట్ వార్త);**
భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహానికి గీసుకొండ సిఐ విశ్వేశ్వర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ బాబాసాహెబ్ గొప్పతనాన్ని, ఆయన అందించిన రాజ్యాంగ స్ఫూర్తిని కొనియాడారు. అంబేద్కర్ కేవలం భారతదేశానికే పరిమితమైన నాయకుడు కాదని, ప్రపంచవ్యాప్తంగా గౌరవించబడే మహానుభావుడని అన్నారు. లండన్‌లో ఆయన నివసించిన ఇల్లు నేడు మ్యూజియంగా మారడమే ఆయన ప్రపంచవ్యాప్త కీర్తికి నిదర్శనం. మన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్దది మాత్రమే కాదు, ఎన్నో దేశాలకు దిశానిర్దేశం చేస్తున్న అత్యుత్తమ గ్రంథం అని పేర్కొన్నారు.

**మహిళల హక్కుల కోసం పోరాటం**

నాడు సమాజంలో మహిళలకు సమాన హక్కులు లేని కాలంలోనే తల్లిదండ్రుల ఆస్తిలో ఆడపిల్లలకు సమాన వాటా ఉండాలని అంబేద్కర్ పోరాడారని గుర్తుచేశారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే అది బాబాసాహెబ్ కల్పించిన రాజ్యాంగ ఫలమేనని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తితో జీవిస్తూ, అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలకు మనమంతా రుణపడి ఉండాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. జై భీమ్. జై అంబేద్కర్ నినాదాలతో సభా ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..
బుధవారం 15 ఏప్రిల్ 2026




# అక్షర యోధుడు..

# ఆశయ ప్రదాత.

## వరంగల్‌లో అంబరాన్నంటిన అంబేద్కర్ జయంతి వేడుకలు

**కాశీబుగ్గలో నివాళులర్పించిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కలెక్టర్ -కేఎంసీ ఆడిటోరియంలో వైభవంగా జయంతోత్సవ మహాసభ**

**ముఖ్య అతిథిగా హాజరైన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు -జయహో అంబేద్కర్.. నీరాజనం పట్టిన దళిత లోకం**

**వరంగల్ బ్యూరో/ఏప్రిల్ 14(జర్నలిస్ట్ వార్త):**
భారత రాజ్యాంగ నిర్మాత, జ్ఞాన భాస్కరుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు వరంగల్ జిల్లాలో ఆదివారం పండుగ వాతావరణంలో జరిగాయి. నీలం రంగు పులమకున్న నగరం, బాబాసాహెబ్ స్మరణతో మార్మోగింది. నగరం నడిబొడ్డున ఉన్న కాశీబుగ్గ సెంటర్ నుంచి కేఎంసీ ఆడిటోరియం వరకు ఎటు చూసినా అంబేద్కర్ చైతన్యమే కనిపించింది. ఉదయం కాశీబుగ్గ సెంటర్ వద్ద ఉన్న బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి, మహనీయుల జయంతి ఉత్సవాల చైర్మన్ బిర్రు మహేందర్ మాదిగలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబాసాహెబ్ చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన చూపిన బాటలో నడవడమే సమాజానికి శ్రేయస్కరమని వారు ఆకాంక్షించారు.
జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేఎంసీ ఆడిటోరియంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతోత్సవ మహాసభ ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అతిథులు, బాబాసాహెబ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

### అంబేద్కర్ ఫలాలు అందరికీ అందాలి. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. "ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని అందించిన ఘనత అంబేద్కర్‌దే. ఆయన కల్పించిన హక్కులు, రిజర్వేషన్ల ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి అందినప్పుడే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి" అని స్పష్టం చేశారు.





### సమసమాజమే సమున్నత లక్ష్యం, సిరిసిల్ల రాజయ్య.

ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ప్రసంగిస్తూ కులమతాలకు అతీతంగా సమసమాజ నిర్మాణం కోసం అంబేద్కర్ పడిన తపనను కొనియాడారు. రాజ్యాంగం కల్పించిన ఆర్థిక సామాజిక స్వేచ్ఛను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

### విద్యే ఆయుధం. కలెక్టర్ సత్య శారదా దేవి

కలెక్టర్ మాట్లాడుతూ చదువుకో. పోరాడు. సంఘటించు అన్న అంబేద్కర్ నినాదం నేటి యువతకు దిక్సూచి అని పేర్కొన్నారు. విద్య ద్వారానే అణగారిన వర్గాల తలరాతలు మారుతాయని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.



### జన సముద్రమైన సభా ప్రాంగణం

మహనీయుల జయంతి ఉత్సవాల చైర్మన్ బిర్రు మహేందర్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సభకు జిల్లా నలుమూలల నుండి భారీగా జనం తరలివచ్చారు. దళిత ప్రజా సంఘాలు, వివిధ కుల సంఘాల నాయకులు, అంబేద్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులు.
ప్రభుత్వ అధికారులు, వివిధ విభాగాల ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, మహిళలు పెద్ద ఎత్తున హాజరై అంబేద్కర్ జ్యోతికి ప్రణామం చేశారు. సభా ప్రాంగణమంతా జై భీమ్ నినాదాలతో హోరెత్తింది. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో నిర్వహించిన ఈ వేడుకలు అంబేద్కర్ సిద్ధాంతాలను మరోసారి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాయి.



